క్లుప్తంగా

నూతన సీఐగా వినాయక్‌రెడ్డి



పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు నూతన సీఐగా వినాయక్‌రెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులకు అందుబాటులో ఉండి న్యాయం చేస్తానని చెప్పారు. శాంతి భద్రతల పరిరక్షణకు అందరి సహకారం ఉండాలన్నారు. గతంలో పటాన్‌చెరు సీఐగా పని చేసిన ప్రవీణ్ రెడ్డి బదిలీపై ఐజీ ఆఫీసుకు వెళ్లారు.

హెచ్‌ఎంల సమావేశం

పుల్‌కల్(అందోల్): పదో తరగతి పరీక్షల ఉత్తీర్ణత శాతం పెంపునకు, దివ్యాంగులకు ఫిజియోథెరిపి, తదితర అంశాలపై ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ శంకర్ మాట్లాడుతూ.. పదో తరగతి పరీక్షలకు విద్యార్థులను సమయాత్తం చేయాలని ప్రధానోపాధ్యాయులకు సూచించారు.

వివరాల నమోదు సక్రమంగా ఉండాలి



సర్వే వివరాలను పరిశీలిస్తున్న హరినందన్

మునిపల్లి(అందోల్): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కులగణన సర్వేలో వివరాలు సక్రమంగా నమోదు చేసుకోవాలని ఎంపీడీఓ హరినందన్‌రావు సూచించారు. బుధవారం మండలంలోని తాటిపల్లి గ్రామంలో ఎన్యుమరేటర్లు నిర్వహిస్తున్న సర్వేను పరిశీలించి, పలు సూచనలు చేశారు. అలాగే, కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలను సందర్శించి, విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రంలో రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సరిత, కస్తూర్బాగాంధీ ప్రిన్సిపాల్ కవిత, అంగన్‌వాడీ టీచర్ శోభ, రజిత తదితరులు పాల్గొన్నారు.

నాసా ప్రాంతీయ కన్వెన్షన్‌లో విద్యార్థిని ప్రతిభ

పటాన్‌చెరు టౌన్: నాసా 67వ ప్రాంతీయ కన్వెన్షన్‌లో గీతం స్కూల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ రెండో ఏడాది విద్యార్థిని రేష్మిక ప్రతిభ చాటారు. 'రైటింగ్ ఆర్కిటెక్చర్' పోటీలో ప్రత్యేక అవార్డును అందుకుందని ఇన్‌చార్జి డైరెక్టర్ బంధన్ కుమార్ మిశ్రా బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గీతం ఉన్నత విద్యా ప్రమాణాలను ప్రతిబింబిస్తూ నిర్మాణ ఆలోచనలను విమర్శనాత్మకంగా విశ్లేషించి, సమర్థవంతంగా వెల్లడించడంలో రేష్మిక అసాధారణ సామర్థ్యాన్ని చూపిందని చెప్పారు. హైదరాబాద్‌లోని అరోరాస్ డిజైన్ అకాడమీలో ఇటీవల జరిగిన 67వ నాసా ప్రాంతీయ కన్వెన్షన్‌లో 25 మంది మొదటి, రెండో ఏడాది గీతం ఆర్కిటెక్చర్ విద్యార్థులు పాల్గొన్నట్లు తెలియజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు శృతి, విద్యార్థులు పాల్గొన్నారు.

బేబీ చైర్స్ అందజేత



జహీరాబాద్: మండలంలోని రంజోల్ గ్రామంలో గల అంగన్‌వాడీ కేంద్రానికి స్వచ్ఛంద సంస్థ బేబీ చైర్‌లను అందజేశారు. బుధవారం అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో గ్రామీణ్ లిమిటెడ్ అండ్ క్రెడిట్ ఆక్సెస్ ఇండియా ఫౌండేషన్ జహీరాబాద్ బ్రాంచ్ ఆధ్వర్యంలో 20 బేబీ చైర్స్, 4 ఆర్మ్‌లెస్ చైర్స్, రెండు కార్పెట్‌లను అందజేశారు. ఐసీడీఎస్ సీడీపీఓ అంజమ్మ, సూపర్‌వైజర్ నీరజ, ఉపాధ్యాయురాలు ఎస్.సంగీత, జీకే ప్రతినిధులు జి.సతీష్ బాబు, సంతోష్ చావ్లా పాల్గొన్నారు.

మురుగు నిల్వకుండా చర్యలు



పనులను పరిశీలిస్తున్న స్వరూప్ షెట్కార్

నారాయణఖేడ్: పట్టణంలోని మంగల్‌పేట్ రోడ్డులో జాతీయ రహదారి పక్కన మురుగునీరు నిల్వకుండా మున్సిపాలిటీ ఆధ్వర్యంలో బుధవారం చర్యలు చేపట్టారు. ఈ రోడ్డులో పలుచోట్ల మురుగుకాల్వలు లేకపోవడంతో మురుగునీరు రోడ్డుపై ప్రవహిస్తోంది. సమస్యను పరిష్కరించేందుకు కాల్వలు లేని చోట ప్లాస్టిక్ పైపులు వేసి మురుగునీరు నిల్వకుండా చర్యలు తీసుకున్నారు. ఈ పనులను మున్సిపల్ చైర్మన్ ఆనంద్ స్వరూప్ షెట్కార్, శానిటరీ అధికారి శ్రీనివాస్‌లు పరిశీలించారు.

ఆధ్యాత్మిక కేంద్రం.. భక్తిధామ్ తండా

- సేవలాల్ మహరాజ్ బాటలో గిరిపుత్రులు
- బల్కంచెల్క తండాకు పేరు ప్రఖ్యాతులు
- నేటి నుంచి విశ్వపాళిని మందిరం వార్షికోత్సవం



బల్కంచెల్క తండాలోని విశ్వపాళిని భవానిమాత, సేవలాల్ మహరాజ్ మందిరం





కొలువుదీరిన సేవలాల్ మహరాజ్, భవానిమాత

కల్హేర్(నారాయణఖేడ్): సంత్ శ్రీ సేవాలాల్ మహరాజ్ చూపిన మార్గాన్ని గిరిజనులు అనుసరిస్తున్నారు. నిత్యం ధార్మిక కార్యక్రమాలతో సన్మార్గం .. క్రమశిక్షణ వైపు నడుచుకుంటున్నారు. సంగారెడ్డి జిల్లా, నిజాంపేట మండలం, బాచేపల్లి పరిధిలోని బల్కంచెల్క తండా ఆధ్యాత్మిక కేంద్రంగా విరజిల్లుతుంది. తండాలో విశ్వపాలిని(జ్వాలాముఖి) భవాని సమేత సేవాలాల్ మహరాజ్ మహా మందిరం నిర్మాణంతో రాష్ట్రంలోనే పేరు ప్రఖ్యాతలు వచ్చాయి. దీంతో భక్తిధామ్ తండాగా గుర్తింపు వచ్చింది. బల్కంచెల్క తండాలో మందిరం ధర్మకర్త మూడ్ కిషన్‌సింగ్-లలితబాయి దంపతుల ఆధ్వర్యంలో ఈ నెల 21 నుంచి 12వ వార్షికోత్సవం నిర్వహించేందుకు సర్వం సిద్ధం చేశారు.

ఆహ్లాదకరం.. మందిరం..

బల్కంచెల్క తండాలో నిర్మించిన భవానిమాత, సేవాలాల్ మహరాజ్ మందిరం పర్యాటక శోభను సంతరించుకుంది. మేడ్చల్ జిల్లా రవాణా శాఖ అధికారి, మందిరం ధర్మకర్త మూడ్ కిషన్‌సింగ్, తండావాసుల చొరవతో మందిరం నిర్మాణం చేశారు. పాలరాతితో తయారు చేసిన సేవాలాల్ మహరాజ్ విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. గిరిజనుల ఆరాధ్య దైవం తపస్వీ రాంరావు మహరాజ్ స్వయంగా మందిరంలో భవాని మాత, సేవాలాల్ మహరాజు విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఇక్కడి మందిరంలో భవాని మాత, సేవాలాల్ మహరాజ్‌ను దర్శించుకుని భక్తులు పూజలు చేయడం ఆనవాయితీగా వస్తుంది. మందిరం వద్ద సేద తీరేందుకు భక్తులు ఆసక్తి చూపుతారు. ప్రతి ఏటా 41 రోజుల భవాని మాత దీక్షలు చేపట్టి ఆదర్శంగా నిలుస్తున్నారు.

నేటి నుంచి ఉత్సవాలు

తండాలో విశ్వపాళిని(జ్వాలాముఖి) భవాని సమేత సేవాలాల్ మహరాజు మహా మందిరం 12వ వార్షికోత్సవం నేటి (గురువారం) నుంచి నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. 21న గంగాపూజ, స్వస్తి పుణ్యవచనం, మహాగణపతి పూజ, రుత్విక్ వరుణం, ఆవాహిత మంటప పూజలు, గణపతి దుర్గా హోమాదులు, అమ్మవారి విశేష అభిషేకం, అలంకరణం, మహానైవేద్యం, మంగళహారతి, మంత్ర పుష్పం, తీర్థ ప్రసాద వితరణ కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు.

అంకితభావంతో విధులు నిర్వహించాలి

ఎమ్మెల్యే సంజీవరెడ్డి



నారాయణఖేడ్: పీహెచ్‌సీలో రికార్డులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి



కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

నారాయణఖేడ్: విధి నిర్వహణలో ఉద్యోగులు అంకితభావంతో పని చేయాలని ఎమ్మెల్యే సంజీవరెడ్డి పేర్కొన్నారు. నాగల్‌గిద్ద మండలంలోని కరస్‌గుత్తి పీహెచ్‌సీని బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ఆస్పత్రికి వస్తున్న పేషెంట్ల వివరాల రికార్డులను పరిశీలించారు. వైద్య సిబ్బంది విధులపై నిర్లక్ష్యంగా వ్యవహరించొద్దని సూచించారు. మారుమూల ప్రాంతాల ప్రజలు ఆయా అనారోగ్య సమస్యలతో ఆస్పత్రులకు వస్తుంటారని, వారికి సరియైన వైద్య సదుపాయాలు అందించాలన్నారు. గ్రామీణులకు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత, సీజనల్ వ్యాధుల ప్రభావం, నివారణలకు తీసుకోవాల్సిన కనీస జాగ్రత్తలపై అవగాహన కల్పించాలన్నారు. సిబ్బంది వివరాలు, హాజరు పట్టిక, మందులు, పేషెంట్ల వివరాల రికార్డులన్నింటినీ తప్పకుండా నిర్వహించాలని ఆదేశించారు. పలువురు రోగులు, వారి సహాయకులతో మాట్లాడి పీహెచ్‌సీలో అందుతున్న వైద్య సేవలపై ఎమ్మెల్యే ఆరా తీశారు. ఆయన వెంట నాయకులు సచిన్ పాటిల్, అంబ్రేష్, పండరిరెడ్డి, ముంతాజ్ ఉన్నారు.

అర్హులకు పథకాలు అందజేత

కల్హేర్(నారాయణఖేడ్): అర్హులైన పేదలకు ప్రభుత్వ పథకాలు అందజేస్తామని ఎమ్మెల్యే సంజీవరెడ్డి పేర్కొన్నారు. బుధవారం కల్హేర్, సిర్గాపూర్ మండలాల లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల రుణామాఫీ చేసి చరిత్ర సృష్టించిందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్లు ఉమాశంకర్, శివశ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు యాదవరెడ్డి, తుకరాం, సాయిలు, జయరాజ్, నాగరాజ్, గంగారాం పాల్గొన్నారు.



ఎంపీకి వినతి పత్రం ఇస్తున్న గ్రామస్తులు

అక్రమ రోడ్డు నిర్మాణంపై ఫిర్యాదు

జిన్నారం (పటాన్‌చెరు): జిన్నారం మండలంలోని సర్వే నంబర్ 1002లో వందఫీట్ల విస్తీర్ణంతో అక్రమంగా రోడ్డు పనులు చేపట్టారని ఎంపీ రఘునందన్ రావును బుధవారం జిన్నారం గ్రామస్తులు కలిసి ఫిర్యాదు చేశారు. ఈ వ్యవహారంపై జిన్నారం తహసీల్దార్ భిక్షపతికి పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. రోడ్డు నిర్మాణ పనులను తక్షణమే నిలిపివేయాలని కోరారు. తక్షణమే స్పందించిన ఎంపీ జిన్నారం తహసీల్దార్‌తో ఫోన్ మాట్లాడారు. రోడ్డు పనులను నిలిపివేయాలని ఆదేశించారు. ఈ సమస్యపై చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌కు లేఖ పంపనున్నట్లు తెలిపారు. భూ వ్యవహారాల్లో పోలీసులు జోక్యం చేసుకోవద్దని జిన్నారం ఎస్సై నాగలక్ష్మికి సూచించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రతాప్‌రెడ్డి, నాయకులు నరసింహారెడ్డి, రాజిరెడ్డి, మహేందర్ గౌడ్, వెంకటేష్ యాదవ్, సుధాకర్ యువకులు పాల్గొన్నారు.

మందుబాబులకు జరిమానా

సంగారెడ్డి క్రైమ్: పట్టణ ట్రాఫిక్ ఎస్‌ఐ సుమన్ కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం అర్ధరాత్రి డ్రంక్ అండ్ డ్రైవ్‌లో భాగంగా ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఇందులో ముగ్గురు వాహనదారులు మద్యం సేవించి పట్టుపడ్డారు. వారిని బుధవారం సంగారెడ్డి జిల్లా న్యాయస్థానంలో హాజరుపరచగా జిల్లా జడ్జి ఒక్కరికి రెండు రోజులు జైలుశిక్ష, మిగతా వారికి రూ. 2000 చొప్పున జరిమానా విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

ఘనంగా సహకార సంఘాల వారోత్సవాలు

జిన్నారం (పటాన్‌చెరు): గుమ్మడిదల మండల కేంద్రంలోని రైతు వేదికలో సహకార సంఘం వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. సహకార సంఘం చైర్మన్ నంద్యాల విష్ణువర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేశారు. 71వ సహకార సంఘాల వారోత్సవాల్లో గుమ్మడిదల మండల పీఏసీఎస్ డైరెక్టర్లు యూనియన్ ఎండీ అన్నపూర్ణ, జాయింట్ డైరెక్టర్ తుమ్మ ప్రసాద్, జాయింట్ రిజిస్టర్ ధాత్రిదేవిలు పాల్గొని ప్రసంగించారు.

కరపత్రాల ఆవిష్కరణ

కంగ్టి(నారాయణఖేడ్): సంగారెడ్డిలో ఆదివారం బ్రాహ్మణ సమాజం ఆధ్వర్యంలో నిర్వహించనున్న మాతాపితృ వందన మహోత్సవ ఆహ్వానం కరపత్రాలు ఆవిష్కరించారు. కార్తీక మాసం పురస్కరించుకొని వనభోజనాలు బుధవారం ఘనంగా నిర్వహించారు. జిల్లాకు చెందిన పబ్లిక్ ప్రాసిక్యూటర్ కలకర్ణి అనంత్‌రావు వ్యవసాయ క్షేత్రంలో తులసి, ఉసిరి చెట్టుకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

చిరుధాన్యాల వైపు మొగ్గు చూపండి



సాగుపై అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

జహీరాబాద్: డీడీఎస్-కేవీకే ఆధ్వర్యంలో శాస్త్రవేత్తలు క్షేత్ర సందర్శన, శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. బుధవారం న్యాల్‌కల్ మండలంలోని మెటల్‌కుంట గ్రామంలో మల్లారెడ్డి వ్యవసాయ కళాశాల విద్యార్థులు పీఆర్‌ఏ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా కేవీకే శాస్త్రవేత్తలు శీతాకాలంలో పండించే కూరగాయలపై రైతులకు శిక్షణ ఇచ్చారు. ఉద్యాన శాస్త్రవేత్త శైలజ కూరగాయలు, పసుపు, అల్లం, పండ్ల తోటలు, పూల తోటలు రబీలో వేసుకునే పంటలకు మెలకువలు తెలిపారు. శాస్త్రవేత్త సాయిప్రియాంక మాట్లాడుతూ.. కేవీకేలో మట్టి పరీక్షలు ఉచితంగా చేస్తారని చెప్పారు. అలాగే, వర్మీ కంపోస్టు, పెంట ఎరువు లభిస్తాయన్నారు. చిరుధాన్యాల వైపు రైతులు మొగ్గు చూపాలని కోరారు. వ్యవసాయ కళాశాల విద్యార్థులు పటం ద్వారా రైతులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. క్షేత్ర సందర్శనలో సాగులో ఉన్న పలు రకాల పంటల గురించి విద్యార్థులకు తెలియజేశారు. కార్యక్రమంలో శాస్త్రవేత్త సాయిప్రియాంక, ఏఈఓ మాధవి, రైతులు పాల్గొన్నారు.

లగచర్లకు వెళ్లకుండా కట్టడి



సంగారెడ్డి రూరల్: గిరిజన నాయకులను అరెస్ట్ చేసిన పోలీసులు

సంగారెడ్డి క్రైమ్: వికారాబాద్ జిల్లా దుద్యాల్ మండలం లగచర్లలో రైతు కుటుంబాలను పరామర్శించడానికి వెళ్తున్న పట్టణ లంబాడా నాయకులను పోలీసులు అడ్డుకున్నారు. లంబాడా నాయకులు జైపాల్‌నాయక్, పూల్‌సింగ్ ఇతర 13 మందిని పట్టణ సీఐ రమేష్, పోలీసులు అడ్డుకున్నారు. వారిని ముందస్తుగా అరెస్టు చేసి పట్టణ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..లగచర్లలో నిజానిర్ధారణ కోసం వెళ్తుంటే ఎందుకు అడ్డుకుంటారని పోలీస్‌లను ప్రశ్నించారు. అరెస్టు చేసిన వారిని సాయంత్రం విడిచిపెట్టారు.

సంగారెడ్డి రూరల్: చలో లగచర్ల కార్యక్రమానికి బయలుదేరిన ఉమ్మడి మెదక్ జిల్లా గిరిజన సంక్షేమ సంఘం అధ్యక్షుడు జైపాల్‌నాయక్‌తో పాటు సంఘం నాయకులను బుధవారం సంగారెడ్డి పట్టణ పోలీసులు ముందస్తుగా అరెస్టు చేసి స్టేషన్‌కి తరలించారు. ఈ సందర్భంగా జైపాల్‌నాయక్ మాట్లాడుతూ.. కొడంగల్ నియోజకవర్గంలోని లగచర్ల ఘటనపై వారి సమస్యలు తెలుసుకోవడానికి వెళ్తున్న నాయకులను అడ్డుకోవడం సరికాదని మండిపడ్డారు. ప్రభుత్వం వెంటనే స్పందించి లగచర్ల రైతులకు న్యాయం చేయాలన్నారు. లేని యెడల రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామన్నారు.

నారాయణఖేడ్‌లో..

నారాయణఖేడ్: లగచర్ల ఘటనపై బుధవారం నిరసన తెలిపేందుకు వెళ్లకుండా ఖేడ్‌లో పలువురు గిరిజన సంఘాల నాయకులను పోలీసులు ముందస్తు అరెస్టు చేసి ఠాణాకు తరలించారు. అరెస్టయిన వారిలో జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ కమిటీ మాజీ సభ్యుడు రవీందర్‌నాయక్ , పలు గిరిజన సంఘాల నాయకులు ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ ఉచిత కంటి వైద్య శిబిరం

వట్‌పల్లి(అందోల్): సర్వేంద్రియాలన్నింటిలో నయనం ప్రధానమని సరోజినిదేవి కంటి ఆస్పత్రి మాజీ సూపరింటెండెంట్ డాక్టర్ రవీందర్ గౌడ్ అన్నారు. బుధవారం వట్‌పల్లిలో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం, మధుమేహ వ్యాధి అవగాహన కార్యక్రమంలో పలువురికి కంటి పరీక్షలు నిర్వహించి, 7 మందికి కంటి ఆపరేషన్లు అవసరమని గుర్తించారు. పలువురికి కంటి అద్దాల ను పంపిణీ చేశారు. కార్యక్రమంలో లయన్స్ డిస్ట్రిక్ సెక్రటరీ అనంతరెడ్డి, ఓబుల్‌రెడ్డి, కోటిరెడ్డి, ప్రోగ్రామ్ చైర్మన్ పెద్దన్న, చైర్మన్ మోహినోద్దీన్, సెక్రటరీ కిషన్ పాల్గొన్నారు.

◆ నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

పటాన్‌చెరు టౌన్: సబ్‌స్టేషన్ మరమ్మతుల్లో భాగంగా గురువారం ఉ. 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పటాన్‌చెరులో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ జగదీష్ బుధవారం ఓ ప్రకటనను తెలిపారు. సబ్ స్టేషన్ మరమ్మతులతో పాటు, చెట్ల కొమ్మలు తొలగింపు నేపథ్యంలో విద్యుత్ సరఫరా అంతరాయం ఉంటుందన్నారు.

రుద్రారం సబ్‌స్టేషన్ పరిధిలో...

పటాన్‌చెరు మండలం రుద్రారం సబ్‌స్టేషన్ మరమ్మతుల నేపథ్యంలో గురువారం ఉ.9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా అంతరాయం ఉంటుందని ఇస్నాపూర్ ఏఈ వీరాంజనేయులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

◆ రేపు రైల్వే ఓవర్‌బ్రిడ్జి రోడ్డు మూసివేత

జహీరాబాద్: ఈ నెల 22న(శుక్రవారం) పట్టణంలోని మొగుడంపల్లి క్రాస్ రోడ్డు నుంచి ఈద్గా వరకు రోడ్డును మూసివేస్తున్నట్లు ఆర్‌అండ్‌బీ ఏఈఈ సంధ్య తెలిపారు. రైల్వే ఓవర్ బ్రిడ్జి కింద ఇరువైపులా ఉన్న సర్వీస్ రోడ్డుపై సీసీ రోడ్డును వేస్తున్నందున ఒక రోజు మొత్తం రహదారి మూసివేయనున్నట్లు చెప్పారు. ప్రజలు, వాహనచోదకులు ఈ విషయాన్ని గమనించాలని సూచించారు.

◆ ఘనంగా పడిపూజ

పటాన్‌చెరు: అమీన్‌పూర్ పట్టణంలోని బీరంగూడ సింఫనీ కాలనీలో వైస్ చైర్మన్ నరసింహాగౌడ్ ఆధ్వర్యంలో బుధవారం అయ్యప్ప మహాపడి పూజను నిర్వహించారు. పడిపూజకు ఎంపీ రఘునందన్ రావు, ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి హాజరయ్యారు. అయ్యప్ప శరణుఘోషతో కాలనీ మార్మోగింది.

◆ ఆపరేటర్లకు శిక్షణ

కంగ్టి(నారాయణఖేడ్): సర్వే ఫాంలు ఆన్‌లైన్‌లో నమోదు చేసేందుకు ఆపరేటర్లకు శిక్షణ ఇచ్చినట్లు ఎంపీడీఓ సత్తయ్య తెలిపారు. ఆన్‌లైన్‌లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మెలకువలపై శిక్షణ ఇచ్చారు. ఎప్పటికప్పుడు సర్వే ఫాంలు ఆన్‌లైన్ చేసి సర్వే ప్రక్రియ పూర్తి చేయాలని ఎంపీడీఓ సూచించారు. కార్యక్రమంలో ఎంపీఓ సుభాష్, ఉపాధిహామీ పథకం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నిరుపేదలకు ఆపన్నహస్తం సీఎంఆర్‌ఎఫ్

ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి



చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు: సీఎం సహాయనిధి నిరుపేదలకు ఆపన్నహస్తం అందిస్తోందని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం నియోజకవర్గ పరిధిలోని వివిధ గ్రామాలు, డివిజన్ల మున్సిపాలిటీలకు చెందిన 152 మంది లబ్ధిదారులకు మంజూరైన రూ. 65 లక్షల విలువైన చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నిరుపేదల సంక్షేమం, ఆర్థిక అభ్యున్నతే లక్ష్యంగా సీఎం రేవంత్‌రెడ్డి పనిచేస్తున్నారని తెలిపారు. త్వరలో అర్హులైన ప్రతి ఒక్కరికి తెల్లరేషన్ కార్డులు అందించబోతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు రవీందర్ రెడ్డి, రాజు, జనార్దన్, సురేందర్‌గౌడ్ పాల్గొన్నారు.

సమగ్ర కుటుంబ సర్వే 75 శాతం పూర్తి

జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి



సర్వేను పరిశీలిస్తున్న కలెక్టర్ క్రాంతి తదితరులు

సంగారెడ్డి జోన్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇంటింటి కుటుంబ సమగ్ర సర్వే సజావుగా కొనసాగుతోందని, జిల్లాలో 75శాతం పూర్తయిందని కలెక్టర్ వల్లూరు క్రాంతి తెలిపారు. బుధవారం పట్టణంలోని 32 వార్డుల్లో సర్వే ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రజల సహకారంతో ఈ సర్వే విజయవంతంగా కొనసాగుతోందన్నారు. సామాజిక, ఆర్థిక, విద్యా, ఉపాధి వంటి రంగాల్లో ప్రజల స్థితిగతులపై అధ్యయనం చేసి, వారికి ప్రభుత్వం తగిన కార్యక్రమాలు రూపొందించడం జరుగుతుందని పేర్కొన్నారు. సర్వేను నిర్దేశిత కాలపరిమితిలోనే పూర్తి చేయాలని సూచించారు. ఈ సర్వే ద్వారా ప్రభుత్వానికి సమగ్రమైన డేటా లభిస్తుందని, తద్వారా నూతన ప్రణాళికల రూపకల్పనకు ఉపయుక్తంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ చౌహాన్, తహసీల్దార్ దేవదాస్, అధికారులు పాల్గొన్నారు.

సర్వేకు సహకరించాలి



సర్వే నిర్వహిస్తున్న ఎంపీడీఓ యాదగిరి

సంగారెడ్డి టౌన్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇంటింటి సమగ్ర కుటుంబ సర్వేకు అందరూ సహకరించాలని సంగారెడ్డి ఎంపీడీఓ యాదగిరి అన్నారు. బుధవారం మండలంలోని ఫసల్వాది గ్రామంలో సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరు ఎన్యుమరేటర్లకు పూర్తి వివరాలను తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, అధికారులు పాల్గొన్నారు.

ఓటర్‌గా నమోదు చేసుకోండి



సంగారెడ్డి రూరల్: సమావేశంలో రవీందర్‌రెడ్డి

సంగారెడ్డి రూరల్: కొత్త ఓటర్ నమోదుపై బుధవారం ఆర్డీఓ రవీందర్ రెడ్డి ఆయా రాజకీయ పార్టీలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రానున్న పంచాయతీ ఎన్నికల దృష్ట్యా అర్హులందరూ ఈ నెల 23, 24 తేదీల్లో తప్పకుండా కొత్త ఓటర్ నమోదు చేసుకోవాలన్నారు. అలాగే ఓటరు జాబితాలో తప్పులుంటే సవరించుకోవాలని సూచించారు.

ఓటర్ నమోదుపై సమావేశం

నారాయణఖేడ్: అర్హులు ఓటర్‌లుగా నమోదు చేసుకోవాలని నారాయణఖేడ్ ఆర్డీఓ అశోక చక్రవర్తి కోరారు. బుధవారం ఆయా రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఆర్డీఓ మాట్లాడుతూ.. ఈ నెల 23, 24 తేదీల్లో పోలింగ్ కేంద్రాల పరిధిలో బీఎల్‌ఓల ద్వారా ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు చెప్పారు. నూతన ఓటర్ల నమోదు, మార్పులు, చేర్పులు, తొలగింపులకు అవకాశం కల్పిస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ భాస్కర్, ఆయా రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలతో నైపుణ్యం మెరుగు

సీఐ శివలింగం



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ శివలింగం

జహీరాబాద్ టౌన్: గ్రంథాలయాల వల్ల విద్యార్థుల్లో పఠన నైపుణ్యం పెరుగుతోందని జహీరాబాద్ టౌన్ సీఐ శివలింగం పేర్కొన్నారు. రూం టు రీడ్ సంస్థ ఆధ్వర్యంలో మండలంలోని అర్జున్‌నాయక్ తండా ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని బుధవారం సీఐ ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రంథాలయాల్లో కథలు తదితర పుస్తకాలు అందుబాటులో ఉండడం వల్ల విద్యార్థులకు చదువుపై ఆసక్తి పెరుగుతుందన్నారు. పాఠశాల విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మండల విద్యాధికారి బస్వరాజ్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో బాష విషయాలతో పాటు భాషేతర విషయాల్లో ప్రగతి సాధించేలా ప్రభుత్వం బడుల్లో రూం టూ రీడ్ సంస్థ ఆధ్వర్యంలో గ్రంథాలయాలు ఏర్పాటు చేస్తుందన్నారు. వీటిలో కథలు, వైజ్ఞానిక పుస్తకాలు, పోస్టర్లు అందుబాటులో ఉంటాయన్నారు. విద్యార్థులు విరామ సమయాన్ని సద్వినియోగం చేసుకుని పఠన, మేథోశక్తి పెంచుకునే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో హైస్కూల్ హెచ్‌ఎం. బాలగోపాల్, పాఠశాల హెచ్‌ఎం. నాగరాజ్, ఉపాధ్యాయుల రమేష్, అపరంజిత అంగన్‌వాడీ టీచర్‌లు పాల్గొన్నారు.

శంభునికుంటను సుందరీకరించండి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

పటాన్‌చెరు టౌన్: అమీన్‌పూర్ పరిధిలోని బీరంగూడలో ఉన్న శంభునికుంటను సుందరీకరించాలని బుధవారం సీపీఎం సీనియర్ నాయకులు నర్సింహారెడ్డి ఇతర నాయకులతో కలిసి తహసీల్దార్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గణపతి ఉత్సవాల సందర్భంగా చెరువులో నిమజ్జనం చేసిన వ్యర్థ పదార్థాలను తొలగించకపోవడంతో పూడిపోతోందన్నారు. అలాగే, దుర్వాసన, దోమలతో పరిసర ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. ప్లాస్టిక్ ఇతర వ్యర్థ పదార్థాలు కుంట నిండా నిండిపోయాయి. వాటిని వెంటనే తొలగించి, కుంటను సుందరీకరించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సీపీఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యురాలు నాయిని లలిత, బీరంగూడ శాఖా కార్యదర్శి వీరస్వామి, సునీత, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

కృత్రిమ గర్భధారణతో లాభదాయకం



మినరల్ కిట్లను అందజేస్తున్న పశువైద్యులు

జహీరాబాద్: లింగ నిర్ధారిత వీర్యంతో ఆడదూడలు పుట్టేలా చేసి పాడి రైతులు ఆదాయం పొందాలని మొగుడంపల్లి మండల పశువైద్యాధికారి సునీల్‌దత్ అన్నారు. బుధవారం మండలంలోని మిర్జంపల్లి తండాలో పశుగణాభివృద్ధి సంస్థ, కేవీకే ఆధ్వర్యంలో ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గోపాల మిత్ర సేవలు వినియోగించుకోవాలని సూచించారు. ఝురాసంగం పశువైద్యాధికారి హర్షవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ.. పశువులు రోగాల బారిన పడకుండా ముందు జాగ్రత్తగా టీకాలు వేయించాలన్నారు. అలాగే, కేవీకే పశుసంవర్ధక శాస్త్రవేత్త కైలాష్ మాట్లాడుతూ.. పాల ఉత్పత్తి పెంచుకోవాలని, పాడి పశువులు ఆరోగ్యంగా ఉండేలా శ్రద్ధ చూపాలని, పోషకాలు కలిగిన మేత, దాణా, మినరల్ మిక్చర్ అందించాలని సూచించారు. కార్యక్రమంలో జేవీఓ రాజయ్య, గోపాలమిత్ర సూపర్‌వైజర్ అర్జునయ్య, ఓఎస్ శంకర్, అరుణ్, కపిల్, గోపాల మిత్రలు రమేష్, శ్రీకాంత్, శ్రీనివాస్, మాజీ సర్పంచ్‌లు గోపాల్, నారాయణ పాల్గొన్నారు.